క్లుప్తంగా

శృంగార వల్లభుడి ఆలయానికి పోటెత్తిన భక్తులు



భక్తుల నుంచి పూజలందుకుంటున్న తిరుపతి శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ కత్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామికి రూ.4,49,254 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. సుమారు ఎనిమిది వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం చేసినట్టు ఈఓ తెలిపారు.

11న మోటారు సైకిళ్ల వేలం

సామర్లకోట: స్థానిక పోలీసు స్టేషన్‌లో 102 సీఆర్‌పీసీ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లను 11వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం వేయనున్నారు. ఈ సందర్భంగా సీఐ కె.దుర్గాప్రసాద్ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండల తహసీల్దార్ ఎస్‌ఎల్‌వీ కుమారి పర్యవేక్షణలో స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చునని తెలిపారు. వివరాలకు 97016 26505 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అన్నవరం ప్రత్యేక ఆహ్వానితుడిగా మోరంపూడి



సామర్లకోట: ప్రముఖ పుణ్య క్షేత్రం అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడిగా మోరంపూడి శ్రీరంగనాయకులు నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడిగా పార్టీ కోసం పని చేస్తున్న మోరంపూడిని గుర్తించి ఆయనకు ఈ గౌరవం అందేలా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఏర్పాట్లు చేశారు. మోరంపూడిని పలువురు అభినందించారు. ఇప్పటికే ఆయన వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ శాఖ జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్నారు.

మండలంలో 'నా భూమి-నా దేశం'



కొత్తపల్లిలో నా భూమి-నా దేశం నిర్వహిస్తున్న నాయకులు

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొత్తపల్లి గ్రామాల్లో శనివారం మండల బీజేపీ అధ్యక్షుడు వాసంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'నా భూమి-నా దేశం' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి కోడూరు లక్ష్మీనారాయణ హాజరయ్యారు. జిల్లా కార్యదర్శి గండి కొండలరావు, రవణం సుబ్రహ్మణ్యం, యరకం రామసుబ్బారావు, కొమ్మినేటి భద్రరావు, తోట శ్రీను పాల్గొన్నారు.

సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జనోత్సవం

కాకినాడ రూరల్: వినాయక చవితి ఈ నెల 18న ప్రారంభమై 26న ముగిస్తుందని, 27, 28 తేదీల్లో సూర్యారావుపేట బీచ్ వద్ద సముద్రంలో గణపతి విగ్రహాలు నిమజ్జనం జరుగుతుందని నగర గణేశ ఉత్సవ సమితి కన్వీనర్ ఎనిమిరెడ్డి మాలకొండయ్య తెలిపారు. రూరల్ ఉత్సవ కమిటీ సమావేశాన్ని కో ఆర్డినేటరు రంబాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం కవికొండల భీమశంకర్ నివాసంలో నిర్వహించి నిమజ్జనోత్సవం పెద్ద ఎత్తున జరగాలని, అందుకు తగ్గ ఏర్పాట్లను ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ఉత్సవ కమిటీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో కవికొండల భీమశేఖర్, పితాని లీలావతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల అరెస్టు, విడుదల

సామర్లకోట: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌పై సీఐడీ విచారణ మేరకు టీడీపీ నాయకుడు చంద్రబాబు అరెస్టుతో ఆ పార్టీ స్థానిక నేతలు స్థానిక మఠం సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేశారు. అనుమతి లేని కార్యక్రమంపై వారిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై వారిని విడుదల చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐలు అబ్దుల్ నబీ, కె.దుర్గాప్రసాద్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

శరవేగంగా ఈ-క్రాప్ నమోదు

- వంట వివరాల నమోదుకు ఆస్కారం
- నియోజకవర్గంలో 60 శాతం పూర్తి



పెద్దాపురం మండలంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వీహెచ్‌ఏ

పెద్దాపురం: నియోజకవర్గ పరిధిలోని రెండు మండలాల్లో ఈ క్రాప్ బుకింగ్ వ్యవసాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా నిర్దేశించిన సమయానికి పూర్తి చేసేందుకు శరవేగంగా నమోదు చేస్తున్నారు. దీని ద్వారా సంబంధిత యాప్‌లో రైతు పేరు, ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు? ఏఏ పంట వేశారో వంటి వివరాలను నమోదు చేస్తారు. ఈ క్రాప్ నమోదు ద్వారా కచ్చితమైన పంట, గణాంకాలను నమోదు చేస్తారు. విపత్తుల సమయంలో పంట నష్టపోతే పరిహారం అందించడమే గాకుండా ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో రైతులకు అందేలా ఈ క్రాప్ ఉపకరిస్తుంది.

పంట సాగు విస్తీర్ణం

నియోజకవర్గ పరిధిలో పెద్దాపురం మండలంలో 10 వేల ఎకరాలు, సామర్లకోట మండలంలో 23 వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. మిగతా అన్ని పంటలు అయిల్ పామ్, దుంప, జీడిమామిడి తదితర పంటలు సుమారు 10 వేల ఎకరాలకు సంబంధించి ఈ క్రాప్ నమోదు జరిగింది.

నమోదు ఇలా..

ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లో సంబంధిత అధికారులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈ క్రాప్ నమోదు చేస్తారు. రైతుల పొలం వద్దకు అంటే సర్వే నెంబర్ల ప్రకారం అధికారులు వెళ్లి ట్యాబ్‌లో యాప్ ఓపెన్ చేసి క్లిక్ చేయగానే 20 మీటర్ల పరిధిలోని సర్వే నెంబర్లు కనిపిస్తాయి. అనంతరం ఆ సర్వే నెంబర్లలో రైతు పేరును నిర్ధారించుకుని యాప్‌లో ఏ పంట వేశారో నమోదు చేస్తోంది. పొలం వద్దే రైతు ఫొటో తీసుకుని యాప్‌లో అప్‌లోడ్ చేసి వెంటనే ఆధార్ నెంబర్, ఫోన్ నెంబర్ నమోదు చేయాలి. దీంతో ఆ సర్వే నెంబర్‌కు ఏ కాలువ నుంచి సాగు నీరు వస్తోంది, నీటి తీరువా ఎంత చెల్లించాలి వంటి వివరాలు తెలుస్తాయి. పంట చిత్రాలను జీపీఎస్ పద్ధతి ద్వారా సర్వర్‌కు పంపుతారు. సర్వే నెంబర్లలో తేడాలను అధిగమించేందుకు వీఆర్వోలు, ఎంపీఈఓలు సంయుక్తంగా ఈ ప్రక్రియను కొనసాగిస్తారు. ఈ నెలాఖరులో పంట వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలనే ఉద్దేశంతో వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ సిబ్బంది చురుగ్గా ఈ క్రాప్ నమోదు వేగవంతం చేస్తున్నారు.

తప్పని సరిగా చేయించుకోవాలి



ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి. ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ క్రాప్ నమోదు వేగవంతం చేశాం. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం వాటిల్లినప్పుడు ఈ క్రాప్ ఎంతగానో మేలు చేస్తుంది.

– ఎం.చిలకమ్మ, వ్యవసాయ సహాయకురాలు, ఆర్‌బీ పట్నం, పెద్దాపురం మండలం

పక్కాగా నమోదు చేస్తున్నాం



నిబంధనలకు అనుగుణంగా పక్కాగా ఈ క్రాప్ నమోదు చేస్తున్నాం. నమోదు ప్రక్రియ వ్యవసాయ సహాయకులు, వీఆర్‌ఓలు సంయుక్తంగా చేస్తున్నారు. ఖరీఫ్ పంటల నమోదులో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తాం.

– కె.సంజయ్‌కుమార్, ఏఓ, పెద్దాపురం మండలం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని వివరిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : బలహీన వర్గాల అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. శనివారం 12, 13 వార్డు పరిధిలోని కొండయ్యపేట, క్రిస్టియన్ పేట ప్రాంతంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఆ వార్డు కౌన్సిలర్లు గుత్రాల మార్త, యాకోబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, నాగబోయిన రాజుబాబు, సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న వైనంపై ఆరా తీశారు. ప్రజా సంక్షేమ పాలన సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని అన్నారు. బీసీ సెల్ జిల్లా కన్వీనర్ పుట్టా వెంకట్రావు, గోలి రామారావు, లక్కాకుల కృష్ణ, సుందరెడ్డి రాజు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి శిక్షణ దోహదం



పదోన్నతిపై బదిలీ అయిన ఎంఎస్ఎన్ రెడ్డిని సత్కరించిన ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీలు



కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేసిన ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీలు

- ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్
- కార్యదర్శులకు ముగిసిన శిక్షణ

సామర్లకోట: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఆరు రోజుల శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె వేణుగోపాల్ అన్నారు. కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గ్రేడ్-1, గ్రేడ్ 5 కార్యదర్శులకు ఆరు రోజుల పాటు నిర్వహించే రెసిడెన్షియల్ ముగింపు శిక్షణలో శనివారం ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో కొత్తగా లే అవుట్ల ఏర్పాటుపై అమలులో ఉన్న నిబంధనలపై పంచాయతీ కార్యదర్శులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో కొత్త లే అవుట్ ఏర్పాటు, పరిపాలన విధానం, హక్కులు, బాధ్యతలు, పంచాయతీ చట్టం, ఉపాధి హామీ పనులు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, క్షేత్ర స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, ఉద్యోగుల విధి నిర్వాహణకు సంబంధించి క్రమ శిక్షణ చర్యలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు. శిక్షణకు 150 మంది కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యదర్శులకు సర్టిఫికేట్లు అందజేశారు. ఫ్యాకల్టీలు శ్రీదేవి, బి.ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, ఎస్‌కె మోహిద్దీన్, నిహారిక పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ రెడ్డికి సత్కారం

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం ఫ్యాకల్టీ ఎంఎస్ఎన్ రెడ్డి సుదీర్ఘ సేవలందించారని ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. పదోన్నతిపై ఈఓపీఆర్డీగా ఆయన పెదపూడి బదిలీ అయిన సందర్భంగా శనివారం సాయంత్రం ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఇక్కడ జరిగే శిక్షణలకు గెస్టు ఫ్యాకల్టీగా రెడ్డిని ఉపయోగించుకుంటామని ఆయన తెలిపారు. శిక్షణ కేంద్రంలోని ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, శ్రీదేవి, నిహారిక, వెంకటేశ్వర రావు, ప్రసాద్, ఎస్‌కె మోహిద్దీన్, ఇతర సిబ్బంది అభినందించారు.

రామలింగేశ్వరునికి దొరబాబు పూజలు



సామర్లకోట రామలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నాభిషేకం చేసిన దవులూరి దొరబాబు

సామర్లకోట: స్థానిక ఐదు తూముల వద్ద ఉన్న అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు స్వామికి అభిషేకాలు చేశారు. విఘ్నేశ్వరపూజ, పంచామృత, అన్నాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. అనంతరం అన్నపూర్ణ దేవికి కుంకుమార్చనలు చేశారు. పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీబీఐ దర్యాప్తుతో అక్రమాలు బట్టబయలు

- ఆధారాలతోనే చంద్రబాబునాయుడు అరెస్టు
- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



సామర్లకోటలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: సీబీఐ చేసిన దర్యాప్తుతో చంద్రబాబు నాయుడు చేసిన అనేక అక్రమాలు బయటకు రావడం వల్లే ఆయనను అరెస్టు చేశారని, చట్టం తన పని తను చేసుకుపోతుందని చెప్పడానికి చంద్రబాబు అరెస్టు ఒక నిదర్శనమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేశారని టీడీపీ నాయకులు ఆరోపించడంపై శనివారం సాయంత్రం స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద దొరబాబు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి అరెస్టుకు కారణాలను వివరించారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2015లో స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌కు తెర తీశారని తెలిపారు. జీఎస్టీ చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం నుంచి జీఎస్టీ రాయితీ కోసం 2018లో ప్రయత్నం చేసిన సమయంలో అవినీతి బండారం బయట పడిందన్నారు. అప్పట్లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండడంతో అవినీతిని బయటకు రానివ్వలేదన్నారు. తిరిగి 2020లో జీఎస్టీ, సిట్ సంస్థలు దర్యాప్తును ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు ఆ సంస్థలు పూర్తి ఆధారాలు సేకరించడంతో నంద్యాలలో చంద్రబాబును అరెస్టు చేశారని, ఈ అరెస్టు సక్రమమే అని దొరబాబు తెలిపారు. కాగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలుగుదేశం నాయకులను హౌస్ అరెస్టు చేశారని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. హౌస్ అరెస్టు అనే సంస్కృతిని తీసుకువచ్చింది ఎవరని ఆయన ప్రశ్నించారు. ముద్రగడ పద్మనాభం తన కులం కోసం పోరాటం చేస్తే అక్రమ అరెస్టు చేయించిది రాజప్ప కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడుకు అవినీతితో సంబంధం లేక పోతే ధైర్యంగా ఉండాలన్నారు. ఈ కేసు మాత్రమే కాకుండా మరికొన్ని కుంభ కోణాల్లో చంద్రబాబునాయుడు పాత్రను గుర్తించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. త్వరలో ఆయా కేసుల్లో కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కేసులపై ఆధారాలు లభించాయని తెలియడంతో చంద్రబాబు ముందుగానే నన్ను అరెస్టు చేస్తారని పార్టీ నాయకులను రెచ్చగొట్టారని తెలిపారు. చట్టానికి అందరూ సమానమేనని తప్పు చేస్తే అరెస్టులు తప్పవన్నారు. ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన హితవు పలిరు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగ తాయారు, వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపీపీ పేర్నీడి వెంకట్రాయుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 564 కేసుల పరిష్కారం

పెద్దాపురం: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జాతీయ స్థాయి లోక్ అదాలత్‌లో 564 కేసులు పరిష్కరించినట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి ఎన్.సరస్వతి తెలిపారు. శనివారం స్థానిక కోర్టు నాలుగు బెంచ్‌లలో న్యాయమూర్తులు ఎస్.సరస్వతి, మురళీమోహన్, బీవీ పద్మావతి, జి.బుల్లెమ్మ కేసులు పరిష్కరించగా న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కక్షిదారులకు ఇన్నర్ క్లబ్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అక్షయ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఫుడ్ ప్యాకెట్లును సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి పంపిణీ చేశారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యం, ఏపీపీ ముమ్మన సోమరాజు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

27 ఏళ్ల కేసుకు పరిష్కారం

అన్నదమ్ముల కేసు రాజీ

పిఠాపురం: తండ్రి ఇచ్చిన ఆస్తికి సంబంధించి ఇద్దరు అన్నదమ్ముల మధ్య 27 ఏళ్లుగా కొనసాగుతున్న కేసుకు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారం లభించింది. కోర్టు వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం పిఠాపురం ఏడు కాల్వలకు చెందిన వాసంశెట్టి నాగన్నకు చెందిన 4 సెంట్ల ఖాళీ స్థలం కోసం ఆయన ఇద్దరు కుమారులు సూర్యనారాయణ, సూర్యచంద్రరావు వివాదాలు పడి కోర్టును ఆశ్రయించారు. ఇద్దరు కోర్టులు ఇచ్చిన తీర్పులపై అప్పీలుకు వెళ్తూ గత 27 సంవత్సరాలుగా కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం పిఠాపురం కోర్టుల సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఇరువురు రాజీ పడడంతో కేసుకు పరిష్కారం లభించింది.



పెద్దాపురంలో ఫుడ్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి సరస్వతి

బతికి సాధిద్దాం..

- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం
- యువతలో పెరుగుతున్న బలవన్మరణ ధోరణి
- గడచిన నాలుగేళ్లుగా పెరిగిన ఆత్మహత్యలు
- గతేడాది జిల్లాలో 79 బలవన్మరణాలు



జీజీహెచ్‌లో మానసిక సమస్యలతో చికిత్స పొందుతున్న బాధితులు

- రాత్రి ఇంటికి ఆలస్యంగా వచ్చాడని తన 16 ఏళ్ల కుమారుడిని తండ్రి ప్రశ్నించడంతో మనస్తాపం చెందిన కుమారుడు తండ్రి అడిగిన గంటలోనే ఫ్యానుకు ఉరేసుకొని విగతజీవిగా వేలాడాడు. కాకినాడ జగన్నాథపురంలో ఈ ఘటన చోటు చేసుకుంది.
- చదువులో ఒత్తిడి తాళలేక ఓ నర్సింగ్ విద్యార్థిని కాకినాడ అచ్యుతాపురంలోని హాస్టల్ వసతి గృహంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.

కాకినాడ క్రైం: బతకడానికి అలుపెరుగని పోరాటం చేస్తున్న ఆశా జీవుల వ్యధలు నిండా బతకాలన్న స్ఫూర్తిని నింపుతుంటే, బంగారం లాంటి నిండు జీవితాల్ని చిదిమేసుకుంటున్న నిరాశావాదుల జీవితాలు గుణపాఠాలకు ఆలవాలమవుతున్నాయి. నిండైన జీవితాన్ని రెప్పపాటులో ముగించేస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. నానాటికీ ఈ ధోరణి పెరుగుతుండడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ మానవ మనుగడపై సవాల్ విసురుతున్న ఓ పెను సమస్యగా ఈ ధోరణిని గుర్తించింది. ఆ దిశగా అవగాహన కల్పించాలని భావించి 2003లో ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని ప్రకటించింది. ఏటా యావత్ ప్రపంచం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ అవగాహనకు పెద్ద పీట వేస్తున్న ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ సూసైడ్ ప్రీవెన్షన్ (ఐఏఎస్‌పి) సంస్థకు ప్రత్యక్ష భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలోనే మూడేళ్ల వ్యవధికి 'ఆశలు చివురించేలా చర్యలు చేపట్టడం (క్రియేటింగ్ హోప్ త్రూ యాక్షన్)' అనే నినాదంతో ప్రపంచానికి పిలుపునిచ్చింది. ఆత్మహత్యలకు వ్యతిరేకంగా గొంతెత్తి నినదిస్తోంది. ఈ స్ఫూర్తి ప్రతి ఒక్కరిలోనూ రగిలేలా క్రియాశీలక చర్యలు చేపడుతోంది.

ఈ కారణాలతో...

ఆత్మహత్యలకు ప్రధాన కారణం డిప్రెషన్ అని శాస్త్రీయంగా నిరూపితమైంది. ఆరోగ్య, ఆర్థిక సమస్యలు ఇందుకు కీలకం. ప్రేమలో వైఫల్యం, చదువులో వెనుకబాటు తనం, నిరుద్యోగం, ఉన్నపళంగా ఉద్యోగం పోవడం, అవమానం, అనుమానం, మోసం, అక్రమ సంబంధాలు, పరీక్షల్లో ఫెయిల్ కావడం, ర్యాగింగ్, మానసిక, శారీరక హింస, లైంగిక దాడులు, అప్పులు, అక్రమ సంబంధాల నేపథ్యం, వృత్తి జీవితంలో సమస్యలు, వ్యాపారాల్లో నష్టాలు, జీవితంపై నిరాశ వంటివన్నీ ఆత్మహత్యలను ప్రేరేపించే కారణాలే.

ఇలా ఉంటే జాగ్రత్త

ఆత్మహత్యకు పాల్పడాలని నిర్ణయించుకునే వారితో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఓ సారి ప్రయత్నం తప్పితే ఏ క్షణాన్నైనా ప్రాణాలు తీసుకునే ప్రమాదం ఉంది. వారి మానసిక స్థితి వారిని ఆ దిశగా నడిపిస్తుంది. ఒంటరిగా ఉండటం, ఏవో ఊహల్లో విహరించడం, అప్పటివరకు దిగులుగా ఉన్న వ్యక్తి పట్టలేని సంతోషంతో వ్యవహరించడం, ఆత్మహత్య, సంబంధిత విషయాలపై తరచు మాట్లాడటం, బాధ్యతలు పూర్తి చేసే ప్రయత్నం చేయడం, బీమా వివరాలు ఇంట్లో వారికి అందించడం, కుటుంబీకుల్ని చూసి అకారణంగా ఒక్కసారి కన్నీటి పర్యంతం కావడం, తన జీవితం ఎందుకూ పనికి రానిదంటూ పలుమార్లు ప్రస్తావిస్తూండడం, డబ్బు ఖర్చులో పొదుపు, జాగ్రత్త లోపించి విచ్చల విడిగా వ్యవహరించడం. ఏదో తప్పు చేశాననో, ఏదో తప్పు జరిగిందనో నిత్యం కుమిలిపోవడం లాంటి లక్షణాలతో వ్యవహరించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వారు ఏ క్షణాన్నైనా బలవన్మరణానికి పాల్పడే అవకాశం ఉంది.

జిల్లాలో గడచిన ఐదేళ్లలో ఆత్మహత్యలు ఇలా..	
2018–	61
2019–	67
2020–	92
2021–	113
2022–	102
2023–	79
(ఆగస్టు నెలాఖరు నాటికి)	

ఆ మూడు రోజులు కీలకం

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని రక్షించిన తక్షణ సమయం చాలా కీలకమైనది. ఆ వెంటనే మానసిక నిపుణుల వద్దకు తీసుకు వెళ్లాలి. 36 నుంచి 72 గంటల వ్యవధిలో మరోమారు ఆత్మహత్యకు ప్రయత్నించే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

చనిపోవాలని అనిపిస్తే...

ఆత్మహత్యకు పాల్పడాలనిపించే వారు ఆ ఆలోచన నుంచి తక్షణం బయటపడాలని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు. అందుకు పలు శాస్త్రీయ మార్గాలు సూచిస్తున్నారు. ఆ ఆలోచనలు వస్తే వైద్యుడిని సంప్రదించాలి. అప్పటి వరకు జీవితంలో చోటు చేసుకున్న సానుకూల అంశాలు, సాధించిన విజయాలను కాగితంపై రాసుకోవాలి. అవి సాధించడానికి పడ్డ కష్టాన్ని, తర్వాత ఆస్వాదించిన ఆనందాల్ని తలచుకోవాలి. తమపై ఆధారపడ్డ వారిని, ముఖ్యంగా పిల్లల్ని తలచుకుంటూ వారితో గడిపిన ఆనంద క్షణాల్ని నెమరువేసుకోవాలి. తాను లేకపోతే కుటుంబ స్థితి ఏ స్థాయికి దిగజారుతుందో గుర్తెరగాలి. అంతే కాక, ఎత్తైన ప్రాంతాలు, నీటి వనరులు, విద్యుత్ తీగల వద్ద ఉండకూడదు. ఆత్మహత్యకు అవకాశం ఉండే వస్తువులు, మాత్రలను దగ్గరగా ఉంచుకోకూడదు.

జీజీహెచ్‌లో వైద్య సేవలు

కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వైద్య విభాగం ఉంది. ప్రతి రోజు 10ఏలో ఓపీ చూస్తారు. నిష్ణాతులైన వైద్యులు సేవలందిస్తారు. 30 పడకల ప్రత్యేక వార్డులు ఉన్నాయి. ఈ వార్డుల్లో స్త్రీలు, పురుషులకు విడివిడిగా వైద్య సేవలు అందిస్తారు. రోగికి పూర్తిగా మానసిక స్థితి సరయ్యే వరకు ఉచిత మందులు ఇస్తారు. ఖరీదైన మానసిక ఆరోగ్య పరీక్షలను ఉచితంగా చేస్తారు.

మూఢనమ్మకాలతో ముప్పు తేవద్దు



వ్యక్తుల మానసిక సమస్యలపై అంచలా లేకుండా మూఢనమ్మకాలతో దెయ్యం పట్టిందని ప్రచారం చేయడం నివారణకు తాయత్తులు, మంత్రాలు ప్రయోగించడం ఏ మాత్రం సరి కాదు. ఈ స్థితి ఆత్మహత్య ఆలోచనలతో సతమతమవుతున్న బాధితుడి ప్రాణానికి కూడా ముప్పుకావచ్చు. ఆత్మహత్య భావోద్వేగాల అంశమే తప్ప వయసుతో నిమిత్తం లేదు. ఏ వయసు వారికైనా ఆలోచన రావచ్చు. బాధితుల్లో స్వీయ ద్వేషం ఎక్కువగా ఉంటుంది. హోప్‌లెస్ నెస్, హెల్ప్ లెస్ నెస్, వర్త్ లెస్ నెస్ సమస్యలు గుర్తిస్తే తక్షణమే ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. తాజా గణాంకాలను అనుసరించి ఆత్మహత్యకు కారణమవుతున్న డిప్రెషన్‌తో 18 ఏళ్ల లోపు పిల్లలు ప్రతి నలుగురిలో ఒకరు బాధపడుతున్నారు.

– డాక్టర్ వానపల్లి వరప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ సైకియాట్రి, ఆర్ఎంసీ, కాకినాడ

ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి అనుకూలం

- సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి



కమిషనర్ రామారావును కలసిన రాష్ట్ర ఉద్యోగుల సంఘ నాయకులు

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సచివాలయ సంఘ అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం రాత్రి స్థానిక మున్సిపల్ కమిషనర్ జె.రామారావును ఆయన మర్యాద పూర్వకంగా కలిసారు. గతంలో రాష్ట్ర యూనియన్‌లో రామారావు పని చేయడంతో కాకినాడ వచ్చిన రాష్ట్ర ఉద్యోగుల సంఘ నాయకులు కమిషనర్ ఇంటికి వచ్చారు. వెంకట్రామిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ ఆర్టీసీ వ్యవస్థను గత ప్రభుత్వం ప్రైవేటు పరం చేయాలనే ఆలోచనలో ఉండగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సాహసమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. దాంతో తెలంగాణలో కూడా ఆర్టీసీని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడానికి కమిటీ వేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి హరగోపాల్, కోశాధికారి ఎస్.రామకృష్ణ, ఉపాధ్యక్షుడు విప్పర్తి నికిల్‌కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగు సంఘ నాయకులను కమిషనర్ జె.రామారావు సత్కరించారు.

రాంబాబు మృతి తీరని లోటు

పిఠాపురం: స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు మోరుకుర్తి రాంబాబు మృతి కార్మిక సంఘానికి తీరని లోటని సీఐటీయూ నాయకులు కె.చిన్న, విశ్వనాథం, డి.సత్యనారాయణ, కె.రమణ, ఎం సూరిబాబు అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి రాంబాబు చేసిన కృషిని ఈసందర్భంగా వారు కొనియాడారు. రాంబాబు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.